

సోలార్‌తో భావితరాలకు ప్రకృతి పర్యావరణం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రూఫ్ టాప్ సోలార్ కనెక్షన్‌తో భావితరాలకు ప్రకృతి పర్యావరణం కాలుష్యం కాకుండా కాపాడవచ్చుని విద్యుత్ ఎస్ఇ రమణ తెలిపారు. శుక్రవారం స్థానిక కొర్రపాడు రోడ్డులోని న్యూ వివేకానంద క్లాత్ మార్కెట్లో స్వశక్తి ఎనర్జీ సబ్ బ్రాంచ్‌ను రమణ దండపానీలు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాలకు ప్రకృతి,పర్యావరణ నుంచి కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. పేదలు కూడా సోలార్ కనెక్షన్ తీసుకోవడానికి బ్యాంకు రుణ సదుపాయం అందుబాటులో ఉందన్నారు. ప్రతి వినియోగదారుడికి కావలసినటువంటి పేపర్ వర్క్ నుండి సోలార్ సిస్టం ఇంటి మీద అమర్చే వరకు దగ్గరుండి సర్వీస్ చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో భానుమతి పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో టెన్షన్.. టెన్షన్!

- జనరల్ బాడీకి తొలగని కుర్చీ గ్రహణం
- ఎమ్మెల్యే మాధవి వర్సెస్ మేయర్
- టిడిపి కుయుక్తులకు కమిషనర్ వత్తాసు
- కమిషనర్ టార్గెట్‌గా పాలకవర్గం పావులు
- కాన్ఫరెన్స్ హాల్ ఎదుట మాక్ జనరల్ బాడీ
- కమిషనర్, కార్పొరేషన్ అధికారులు గైర్హాజర్
- కమిషనర్, డిప్యూటీ కమిషనర్, ఎస్ఇని సరెండర్ చేయాలని తీర్మానాలు
- దేశంలో ఎక్కడా ఇటువంటి దుస్థితి లేదు : మేయర్



సమావేశపు హాలులో వేచి ఉన్న ఎమ్మెల్యే మాధవి



సమావేశ హాలులో ఖాళీగా దర్శనమిస్తున్న మేయర్ కుర్చీ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/కడపఅర్బన్

కడప కార్పొరేషన్ సర్వసభ్య సమావేశానికి కుర్చీ గ్రహణం తొలగడం లేదు. కడప ఎమ్మెల్యే ఆర్.మాధవికి మేయర్ కె.సురేష్‌బాబుతో సమానంగా కుర్చీ వేయలేదనే పేరుతో వరుసగా మూడు సర్వసభ్య సమావేశాలు ప్రజాసమస్యలపై ఎటువంటి చర్చకు అవకాశం లేకుండా వృథాగా పోవడం ఆందోళన కలిగిస్తోంది. శుక్రవారం నాటి సర్వసభ్య సమావేశం ఎమ్మెల్యే వర్సెస్ మేయర్ ఎత్తుకు పైఎత్తులతో పీటముడి పడింది. డిప్యూటీ కమిషనర్, ఎఇలు మేయర్‌ను సంప్రదించారు. మేయర్ ఆదేశాలతో సంబంధం లేకుండా కాన్ఫరెన్స్, జనరల్‌బాడీ సమావేశ హాలులకు తాళాలు వేయడం ఏమిటని, తాళాలు తొలగించాలని ఆదేశించినప్పటికీ పాటించకపోవడంలో ఆంతర్యమేమిటని మీడియా సమక్షంలో ప్రశ్నించారు. అధికారుల నుంచి సరైన సమాధానం లేకపోవడంతో వెనుదిరిగిపోయారు. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే, పాలకవర్గ నాయకత్వాల వరుస ఎత్తుగడల కారణంగా తాళం వేసిన కాన్ఫరెన్స్ హాలు ముంగిట మేయర్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం మాక్ జనరల్ బాడీ సమావేశాన్ని తలపించింది. ఎమ్మెల్యే ఎత్తుగడలకు సహకరిస్తూ కమిషనర్, కార్పొరేషన్ ఉన్నతాధికారులు గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. మేయర్ అధ్యక్షతన సుమారు 28 అజెండాలతో కూడిన ప్రజల సమస్యలపై చర్చిస్తూ పలు నిర్ణయాలు తీసుకున్నారు. కార్పొరేషన్ కమిషనర్ జనరల్‌బాడీ సమావేశ హాలుకు తాళం వేయడం, సమావేశ హాలును తెరవాలని మేయర్ ఆదేశించినప్పటికీ తెరవకపోవడం, హైకోర్టు స్పష్టంగా ఆదేశించిందని తెలిపినప్పటికీ తెరవకుండా, ఎమ్మెల్యే ఎత్తుగడలకు అనుగుణంగా మేయర్‌తో సమానంగా కుర్చీ వేయడం, పాలకవర్గం చేసిన పలు తీర్మానాలను అమలు చేయకపోవడం వంటి కారణాలతో కమిషనర్ మనోజ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రాకేష్‌చంద్రం, సూపరింటెండింగ్ ఇంజినీర్ చెన్నకేశవరెడ్డిని ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ తీర్మానం చేశారు. సదరు తీర్మానానికి వైసిపికి చెందిన పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం గమనార్హం. అనంతరం మేయర్ విలేకరులతో మాట్లాడుతూ దేశంలో ఎక్కడా ఇటువంటి దుస్థితి దాపురించలేదన్నారు. మున్సిపల్ చట్టాలకు అతీతమైన వ్యక్తి గత హోదా కల్పించాలని, వ్యక్తి గత పంతాల కోసం ప్రజా సమస్యలను విస్మరించడం దారుణమన్నారు. కాన్ఫరెన్స్ హాలులో సమావేశం నిర్వహించాలనే కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన కమిషనర్‌పై కోర్టు ధిక్కరణ కేసు వేస్తామని తెలిపారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలక కొనసాగుతున్న కారణంగా ప్రజాప్రతినిధులను గౌరవం లేకుండా పోయిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రౌడీయుజం, గూండాయుజం, మాన బంగాలలో బీహార్‌ను మించి పోయిందని తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం జనరల్ ఫండ్‌తో నిర్వహించే పనుల కేటాయింపు సమావేశాలకు కార్పొరేటర్లను పిలవడం లేదన్నారు. టిడిపి రాష్ట్ర మహానాడు నిర్వహణలో భాగంగా కార్పొరేషన్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలకు ఒక్క రూపాయిని కార్పొరేషన్‌కు చెల్లించినట్లు లేదని తెలిపారు. ఆర్టీఐ కింద సమాచారాన్ని అడిగినప్పటికీ స్పందన లేదని వివరించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చినప్పటికీ కార్పొరేషన్‌లో కడప ఎమ్మెల్యేకు గౌరవం ఇచ్చామని, దాన్ని నిలబెట్టుకోలేకపోయారని తెలిపారు. తన పార్టీకి చెందిన మహిళా కార్పొరేటర్‌ను నరగ పాలకవర్గ సమావేశంలోనే అవమానించడం మొదలుకుని కార్పొరేషన్‌లోని చెత్తా చెదారాన్ని మేయర్ ఇంటి కాంపౌండ్ ముంగిట వేయించడం వరకు వెళ్లారని తెలిపారు. మున్సిపల్ చట్టాలను కఠినంగా అమలు చేయడంలో భాగంగానే మేయర్‌తో సమానంగా కుర్చీ వేయలేదని తెలిపారు. కార్పొరేషన్‌కు చెందిన అధికారులు అధికార పార్టీకి కొమ్ముకాస్తూ నియంతలను తలపిస్తున్నారని విమర్శించారు. కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, టిడిపికి సంబంధించిన పలువురు కార్పొరేటర్లతో కలిసి ఉదయం 10.45 గంటల నుంచి జనరల్ బాడీ సమావేశ హాలుకు చేరుకుని సాయంత్రం ఐదు గంటల వరకు సుదీర్ఘంగా నిరీక్షించడం గమనార్హం. అనంతరం కార్పొరేషన్ బయట ఎమ్మెల్యే మాధవి మీడియాతో మాట్లాడుతూ పాలక వర్గానికి ప్రజాసమస్యలపై చర్చించడానికి సమయం లేకుండా పోయిందని పేర్కొన్నారు. సభకు రావాలని నోటీసు అందజేసి మేయర్, డిప్యూటీ మేయర్‌తోపాటు కార్పొరేటర్లు కౌన్సిల్ హాలులోకి రాకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు.



కాన్ఫరెన్స్ హాలు ముంగిట ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సురేష్‌బాబు

కార్పొరేట్ల లబ్ధికోసమే పని గంటల పెంపు

- బ్రిటిష్ పాలనను తలపిస్తున్న మోడీ, చంద్రబాబు పరిపాలన
- నిరసనలో సిఐటియు, ఎఐటియుసి నాయకులు



నిరసన తెలియజేస్తున్న సిఐటియు, ఎఐటియుసి నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఉద్యోగుల, కార్మికుల పని 10 గంటల పెంపు కార్పొరేట్లకు మరింత లాభాల కోసమేనని సిఐటియు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్, ఎల్ నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆర్‌డిఒ కార్యా లయం ఎదుట సిఐటియు, ఎఐటియుసి సంయుక్త ఆధ్వర్యంలో నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, కార్మికులు ఇక నుంచి 10 గంటల పని చేయాలని కేబినెట్ తీర్మానం చేయటాన్ని బ్రిటిష్ పరిపాలనను తలపిస్తుందని వాపోయారు. కార్మిక సంఘాలతో ఆ అంశాల పట్ల చర్చించకుండా పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కుల పట్ల ఏకపక్ష నిర్ణయాలు సరైంది కాదని తప్పుపట్టారు. ప్రపంచవ్యాప్తంగా కార్మికుల పోరాటాల ఫలితంగానే 8 గంటల పని విధానం అమలులోకి వచ్చిందని గుర్తు చేశారు. 8 గంటల పని విధానం అనేది శాస్త్రీయమైన ఆలోచన విధానమని, ప్రభుత్వం పునరాలోచించాల్సిన అవసరం ఉందన్నారు. రోజుకి 24 గంటల్లో 8 గంటల పని, 8 గంటల కుటుంబ సేవలు, 8 గంటల నిద్ర అనేది ప్రపంచ వ్యాప్తంగా కార్మికులు పోరాడి సాధించిన విజయమని ప్రభుత్వం గుర్తించాలన్నారు. బడా కార్పొరేట్ సేవల్లో తలమునకులైన రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల శ్రమను వారికి దోచి పెట్టేందుకు, వారికి లాభాలు అర్జించి పెట్టేందుకే 10 గంటల పని విధాన నిర్ణయమని విమర్శించారు. అదనపు గంటలు కూడా పని చేయవచ్చని, మహిళలు కూడా రాత్రులు డ్యూటీలో కూడా చేయవచ్చని నిర్ణయాలు చేయడమంటే కార్మికులను వెట్టి చాకిరి చేయించుకునే విధానానికి నెట్టివేయడమేనన్నారు. మళ్లీ బానిస వ్యవస్థకు కార్మికులను తీసుకుపోతారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, ఆప్కాస్ ఉద్యోగులందరికీ కనీస వేతనం రూ. 26 వేలు అమలు చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, మున్సిపల్ వర్కర్ యూనియన్ నాయకులు సుంకర రవి, రాజ శేఖర్, జి.వేణుగోపాల్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కె.సి.బాదుల్లా, నగర కార్యదర్శి మద్దిలేటి, నగర అధ్యక్షులు పి.సుబ్బ రాయుడు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లింగన్న, పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి - కడప

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జూన్ 21న ఉత్సవ వాతావరణంలో నిర్వహించి విజయవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ప్రజలను కోరారు. శుక్రవారం కలెక్టరేట్ లోని విసి హాల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 21న గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు నిర్వహించే కార్యక్రమాల నిర్వహణపై కలెక్టర్, జెసి కలెక్టర్ అతిథి సింగ్, డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు తో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా మే 21 నుండి జూన్ 21వ తేదీ వరకు యోగాంధ్ర మాసోత్సవాలను నిర్వహించిందని చెప్పారు. జిల్లాలో ఇది వరకే అనేక కార్యక్రమాలను వివిధ థీమ్ లతో నిర్వహించి ప్రజల్లో యోగాపై అవగాహన కల్పించామని చెప్పారు. జిల్లాలోని నాలుగో ప్రధాన పర్యాటక కేంద్రాలైన ఒంటిమిట్ట ,సిద్ధవటం, శిల్పారామం, గండి కోటలలో భారీ ఎత్తున ఐదు వేల మందితో విజయవంతంగా కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. పాత్రికేయులకు డాక్టర్స్, పోలీస్, వివిధ వర్గాలకు ప్రత్యేకంగా యోగా కార్యక్రమాలను నిర్వహించామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 5,796 మంది యోగా శిక్షకుల ద్వారా ఇప్పటివరకు 5.65 లక్షల వేల మందికి యోగాపై శిక్షణ, అవగాహన కల్పించామని తెలిపారు. జిల్లాలో శనివారం నిర్వహించబోయే గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు జరిగే యోగాంధ్ర కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఆయుష్ యోగ ప్రోటోకాల్ ప్రకారం ఉదయం 7 గంటల నుంచి 8 గంటలలోపు నిర్వహిస్తారన్నారు. ఇందులో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు యోగ విశిష్టతను వివరించే యోగా గురువులచే పలు రకాల ప్రసంగాలు తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు, డిఐపిఆర్ఒ పద్మజ, ఆయుష్ యోగా మెడికల్ ఆఫీసర్ పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి : ఎస్ఎఫ్ఐ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐనాయకులు, బాలికలు

ప్రజాశక్తి - కడప అర్బన్

కేరళ రాష్ట్రంలోని కోజికోడ్ జిల్లాలో ఈ నెల 27 నుంచి 30 వరకు నిర్వహించే ఎస్ఎఫ్ఐ 18వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి, ఉపాధ్యక్షులు అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించి, వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ 1970, డిసెంబర్ 30న స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలుగా అధ్యయనం పోరాటం నినాదంతో ఏర్పాటై 55 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. ప్రభుత్వ విద్యా పరిరక్షణ కోసం 55 సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటం నిర్వహిస్తూ ఎస్ఎఫ్ఐ ముందుకు పోతుందన్నారు. ఎక్కడైతే విద్యార్థుల సమస్యలు ఎదుర్కొంటున్నారో ఆ సమస్యల పరిస్కారం కోసం పోరాటాలు నిర్వహించి విద్యార్థుల గుండెల్లో స్థానాన్ని సంపాదించుకున్న సంఘం ఎస్ఎఫ్ఐ అని వారు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ విద్యార్థులను పోరాటాలకు సిద్ధం చేస్తూ అనేక విజయాలను సొంతం చేసుకుందన్నారు. పేద విద్యార్థికి విద్య అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని గుర్తు చేస్తూ పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. విద్యా పేద విద్యార్థులకు అందని ద్రాక్షలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. 'మా దేహం ముక్కలైన ఈ దేశాన్ని ముక్కలు కనివ్వం' భగత్ సింగ్ స్ఫూర్తితో రాబోవు రోజుల్లో విద్యారంగ సమస్య పరిస్కారం కోసం పోరాటాలకు విద్యార్థులు సిద్ధం అయ్యేందుకు విద్యార్థి సమస్యలు అలుపెరుగని పోరాటం చేసేందుకు ఈ అఖిలభారత మహాసభలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అందరూ మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు అభినయ్, నగర కమిటీ సభ్యులు నిత్య, రఘు,రోహన్ పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

ప్రజాశక్తి-కడప అర్బన్ : మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీవో నంబర్ 36 ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చెయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్కాస్‌లో పనిచేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు తక్కువ వేతనాలు ఇచ్చి వారికి సంక్షేమ పథకాలు అమలు చేయకుండా వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా చూపి తల్లికి వందనం పడకుండా చేశారని విమర్శించారు. కేవలం రూ.13,087 జీతం తీసుకుంటున్న వారిని ప్రభుత్వ ఉద్యోగులని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్మికులను రెగ్యులర్ చేసి న్యాయం చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే మేనిఫెస్టోలో పెట్టిన విధంగా రూ.25వేల లోపు వేతనాలు ఉన్నవారికి సంక్షేమ పథకాల అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం కార్మికులు సమ్మెలోకి వెళ్లక ముందే వారి న్యాయమైన కోర్కెలు తీర్చాలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. 2014లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని చెప్పి మాట తప్పడం వల్ల 2019లో టిడిపి ప్రభుత్వం ఓడిపోయిందని గుర్తు చేశారు. మరల అదే రిపీట్ కాకుండా కూటమి ప్రభుత్వం కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, పి.వెంకట సుబ్బయ్య, అంగన్వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి దేవి, మున్సిపల్ జిల్లా ప్రధాన కార్యదర్శి. ఎం. విజయ్ భాస్కర్, కోశాధికారి గోపి, సహాయ కార్యదర్శి. ఎం.ఆనంద రావు, మున్సిపల్ నగర అధ్యక్షులు సుంకర రవి, శ్యామ్, రామ్మోహన్ రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, బద్రి, సుబ్బయ్య, గురువయ్య, గోవర్ధన్, శ్రీధర్, కార్మికులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - కడప : కెనరా బ్యాంక్ కడప రీజినల్ హెడ్ బి. అరుణ జ్యోతి ఆధ్వర్యంలో కడప కెనరా బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం శుక్రవారం కడప నగరంలోని ఏడు రోడ్ల సర్కిల్లో వినియోగదారుల హక్కులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వినియోగదారుల హక్కులు, ఆర్‌బిఐ అంబు డ్స్‌మన్ పథకం, ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ గురించి అవగాహన కల్పించారు. అనంతరం అరుణ జ్యోతి మీడియాతో మాట్లాడుతూ భద్రమైన, సౌకర్య వంతమైన బ్యాంకింగ్ పద్ధతులు, వినియోగదారుల అవగాహన ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్లు ఎస్. రమేష్, విలియం, లక్ష్మీనారాయణ ప్రజలకు మార్గనిర్దేశనం చేశారు. డిజిటల్ బ్యాంకింగ్, ఫిర్యాదు పరిష్కార విధానాలపై అవగాహన కల్పించారు.



కస్టమర్లకు అవగాహన కల్పిస్తున్న కెనరా బ్యాంక్ రీజనల్ హెడ్ అరుణ జ్యోతి

విలీనం నిలుపుదలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

- పాఠశాలను దత్తత తీసుకొని అభివృద్ధికి కృషి
- జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్

ప్రజాశక్తి - చాపాడు

చియ్యపాడు దళితవాడలోని ప్రాథమిక పాఠశాలను చియ్యపాడు హైస్కూల్లో విలీనం చేయడంపై తల్లిదండ్రుల్లో నిరసన రావడంతో శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మోడల్ పాఠశాలలో భాగంగా కొన్ని ప్రాథమిక పాఠశాలలను విలీనం చేశారని పేర్కొన్నారు. అందులో భాగంగా చియ్యపాడు దళితవాడలోని పాఠశాలను హైస్కూల్లో విలీనం చేశారన్నారు. విద్యార్థులను హైస్కూల్‌కు పంపడంపై తల్లిదండ్రులకు ఇష్టం లేకపోతే ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. వారి ఆదేశాలు వచ్చేంతవరకు గ్రామంలోనే పాఠశాల కొనసాగిస్తామన్నారు. పాఠశాలను దత్తత తీసుకొని అన్ని విధాల అభివృద్ధి పరుస్తానని ఆయన తెలిపారు. వారం రోజుల్లోగా తిరిగి పాఠశాలను సందర్శించి గ్రామస్తులతో కమిటీ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షులు అన్నవరం సుధాకర్ రెడ్డి, ఎంఇఒలు రవిశంకర్, వంశీకృష్ణ, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేపు నూర్‌బాషా ఎంప్లాయీస్ అసోసియేషన్ సమావేశం

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప జిల్లా ఎపి నూరుబాషా ఎంప్లాయీస్ అసోసియేషన్ 84 /2024 సమావేశం ఈనెల 22న నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు పగడాల సిద్దయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్లైండ్ స్కూల్ ఎదురుగా ఉన్న మస్తాన్ కోచింగ్ సెంటర్‌లో కడపలో ఉదయం 10 గంటలకు ఉంటుందని తెపారు. ఎంప్లాయిస్, రిటైర్డ్ ఉద్యోగస్తులు హాజరుకావాలని పేర్కొన్నారు. నూతన కమిటీ ఏర్పాటు, భవిష్యత్తులో చేయవలసిన కార్యక్రమాలు పైన చర్చ ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వచ్చి గౌరవప్రదమైన కమిటీ ఏర్పాటు చేసే కార్యక్రమాల పైన సూచనలు, సలహాలు ఇవ్వాలని తెలిపారు.

గంజాయి నిరోధానికి సమష్టి కృషి

ప్రజాశక్తి- కడప అర్బన్ : గంజాయి రవాణాను నిరోధించడంలో ఆర్‌టిసి డ్రైవర్ల పాత్ర కీలకమని కడప ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డి.కె జావీద్ పేర్కొన్నారు. శుక్రవారం కడప ఆర్‌టిసి ఆర్.ఎం కార్యాలయంలో 'ఈగల్(ఎలైట్ యాంటి-నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్ఫోర్స్ మెంట్) ఆధ్వర్యంలో ఆర్‌టిసి డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ మాట్లాడుతూ గంజాయి రవాణా గురించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 1072కు అందజేయాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతారన్నారు. ఆర్‌టిసి డిఎం దిల్లేశ్వర రావు మాట్లాడుతూ సమాజంలో గంజాయి మహమ్మారిని నిర్మూలించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరముందని తెలిపారు. ఆర్‌టిసి సిబ్బందిగా డ్రైవర్ల పాత్ర ముఖ్యమైందన్నారు. గంజాయి రహిత సమాజంగా మార్చేందుకు మన వంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో 'ఈగల్' ఎస్ఐ మల్లయ్య, ఆర్‌టిసి డ్రైవర్లు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని ట్రంక్ రోడ్‌లో ఉన్న మౌలానా ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రముఖ యోగ టీచర్, మైండ్ సెట్ అండ్ మానిఫెస్టేషన్ కోచ్, హోలిస్టిక్ వెల్‌నెస్ కోచ్ ప్రణవి సుదర్శన్‌ను మౌలానా ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షేక్.అబ్దుల్ షబ్బీర్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా స్టెప్ సిఇఒ సాయి గ్రేసీ చేతుల మీదుగా ప్రణవి సుదర్శన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్టెప్ సిఇఒ మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు. యోగా అనేది ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రణవి సుదర్శన్ చిన్ననాటి నుండే యోగాను ఇష్టపడుతూ యోగా ఇన్‌స్ట్రక్చర్, మోటివేషనల్ స్పీకర్, హోలిస్టిక్ సెల్ఫ్ హెల్ప్ కోచ్‌గా సేవలందిస్తూ యువతకు స్ఫూర్తిదాయకమని తెలుపుతూ అభినందించారు. సన్మాన గ్రహీత ప్రణవి సుదర్శన్ మాట్లాడుతూ యూఎస్ఎ అలియన్స్ సర్టిఫికెట్ యోగా టీచర్‌గా సేవలందిస్తూ ఉత్తరాఖండ్ రిషికేశ్‌లో యోగాలో సేవలందించడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. భవిష్యత్తులో యోగాలో మరిన్ని సేవలందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత కూచిపూడి నాట్యం అంతర్జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ కె. సుమన, విద్యార్థులు షౌకత్ అలీ, సర్ఫరాజ్ అలీ పాల్గొన్నారు.

డయల్ యువర్ డిఎంకు స్పందన

- ఆర్‌టిసి డిఎం ఢిల్లేశ్వరరావు

ప్రజాశక్తి- కడప అర్బన్

డయల్ యువర్ ఆర్‌టిసి డిఎం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని డిఎం డిల్లేశ్వరరావు తెలిపారు. శనివారం ఆర్‌టిసి డిఎం కార్యాలయం నుంచి ప్రజల నుంచి వచ్చిన ఫోన్ కాల్స్ స్వీకరించారు. కడప నుంచి చిత్తూరుకు ఉదయం 05:00 గంటలకు కడప నుంచి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కడప నుంచి ఉదయం 06:00 గంటలకి ఉన్న విజయవాడ సర్వీస్ 05:30 గంటలకు మార్చాలని కృష్ణాపురం వారు కోరారు. దేవుని కడప నుంచి కెవి స్కూల్‌కు బస్సును తిప్పాలని కోరారు. వల్లూరు నుంచి కెవి స్కూల్‌కు బస్సు సౌకర్యం కల్పించమని కోరారు. పైన తెలిపిన వాటిలో మా పరిధిలో ఉన్న వాటికి సాధ్యమైనంత వరకు పరిష్కారం చేస్తామని బియ్యం సమాధానం ఇచ్చారు. మా పరిధిలో లేని వాటికి మా పై అధికారులకు దృష్టికి తీసుకువెళతామని పేర్కొన్నారు.



రైలు పట్టాలపై పడుకున్న అంగన్వాడీ టీచర్ లక్ష్మీ, ఆమె కుమారుడు

అంగన్వాడీ టీచర్ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక పట్టణంలోని ఈశ్వర్‌రెడ్డి నగర్‌కు చెందిన అంగన్వాడీ టీచర్ లక్ష్మి, ఆమె కుమారుడు రైల్వే ట్రాక్‌పై పడుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. బాధితురాలి కథనం మేరకు.. .స్థానిక పట్టణ పరిధిలోని వసంతపేటలో అంగన్వాడి టీచర్‌గా పని చేస్తున్న లక్ష్మి వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు విచారణ కోసం వచ్చిన సందర్భంలో తనను సిఐ వేధింపులకు గురి చేశారని వాపోయారు. తనతోపాటు, కుమా రుడిని, భర్తను వన్ టౌన్ పోలీ సులు కొట్టారని ఆరోపించారు. తమ కుటుంబాన్ని వేధింపులకు గురి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియా చూసిన ఆమె కుమార్తెలు స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ చేరుకొని తమ తల్లిదండ్రులను, తమ్ముడిని కాపాడాలని కన్నీటి పర్యం తమయ్యారు. సంఘటనపై వన్‌టౌన్ సిఐ రామకృష్ణారెడ్డి స్పందిస్తూ అంగన్వాడీ టీచర్ లక్ష్మిని తాను వేధింపులకు గురి చేయలేదని వివరించారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

ప్రజాశక్తి - కడప : నీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రభుత్వ పురుషుల కళాశాల డాక్టర్ జి. రవీంద్రనాథ్ అన్నారు. శుక్రవారం కడప ప్రభుత్వ పురుషుల (అటానమస్) కళాశాలలో 'స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా 'నీరు-మీరు'అనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ నీటి సంరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడుకునే ఆవశ్యకతను తెలిపారు. వృక్షశాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నీటి వనరులను కాపాడుకోవడం మన విధి అన్నారు.



ర్యాలీలో స్కౌట్ విద్యార్థులు

స్కౌట్ విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరులో యోగా వారోత్సవాలలో భాగంగా శుక్రవారం హై స్కూల్ స్కౌట్ విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణ దేవరాయ సర్కిల్‌లో మానవ హారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.ఇలియాస్ అహమ్మద్ మాట్లాడుతూ యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందన్నారు. యోగా అవశ్యకతను, ఉపయోగాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోశెట్టి రామమోహన్, శ్రీనివాసులు, ఆనంద రావు, ఓబులరెడ్డి, రాముడు ఎన్‌సిసి అధికారి సురేంద్రనాయక్, పీడీ రామ్ నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి- ఖాజీపేట : విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కేంద్రంలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇంజినీర్ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 11 వరకు సరఫరా ఉండదని, ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు. మంచినీటికి ఇబ్బందులు పడకుండా ముందస్తు జాగ్రత్తలు వహించాలని ఆయన సూచించారు.

చాపాడు : మైదుకూరు డివిజన్ పరిధిలోని మైదుకూరు, చాపాడు, ఖాజీపేట, వనిపెంట, దువ్వూరు మండలాలలో శనివారం సబ్ స్టేషన్ లలో మరమ్మతులు చేపడుతున్నట్లు ట్రాన్స్ కో డిఇఇ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు.

కొత్త మోటారు ఏర్పాటుకు సర్పంచ్ చొరవ

ప్రజాశక్తి- ఖాజీపేట : మండల పరిధిలోని ఆంజనేయ కొట్టాలు పంచాయతీ, కొత్త పుల్లూరు గ్రామంలో శుక్రవారం కొత్త తాగు నీటి మోటార్ ఏర్పాటు చేశారు. గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తుండడంతో గ్రామ సర్పంచ్ గోపిరెడ్డి పెద్దిరెడ్డి స్పందించి మోటర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. తాగునీటి సమస్య పరిష్కారానికి సర్పంచ్ చొరవ తీసుకోవడం పట్ల గ్రామస్తులు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మా పాపకు న్యాయం చేయండి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు టౌన్

మా పాపకు న్యాయం చేయాలని విద్యార్థిని తండ్రి ప్రభుత్వాన్ని వేడు కుంటున్నారు. ప్రొద్దుటూరుకు చెందిన విద్యార్థి నున్న గంగ భవాని తండ్రి విలేకరుల సమా వేశంలో మాట్లాడితూ తమ పాప ప్రొద్దుటూరు ప్రయివేట్ పాఠశాలలో పదవ తరగతి చదివింది. ఈ ఏడాది మార్చిలో జరిగిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో సైన్స్ సబ్జెక్టులో 84 మార్కులు రాగ అనుమానం వచ్చి రీవాల్యువేషన్‌కు దరఖాస్తు చేసుకున్నామని, అందులో ఒక ప్రశ్నకు జవాబు దిద్దకుండా మార్కులు వేయలేదని, ఆ ప్రశ్నకు ఇంకా 11 మార్కులు వస్తాయని, తెలిపారు. ఉపాధ్యాయులు ప్రశ్నాపత్రం సరిగా దిద్దలేదని విద్యార్థిని తండ్రి ఆరోపించారు. విజయవాడలోని ఎస్ఎస్‌సి బోర్డుకు వెళ్లి అడిగినా ఫలితం లేకపోయిందని విచారం వ్యక్తం చేశారు. తమ విద్యాశాఖ మంత్రి లోకేష్ న్యాయం చేయాలని ని విద్యార్థిని తండ్రి కోరారు.

యోగాతో మానసిక ప్రశాంతత

ప్రజాశక్తి - ముద్దనూరు

యోగా మానసిక ప్రశాంతత ఏకాగ్రతకు ఉపయోగ పడే సాధనమని తహశీల్దార్ వరద కిషోర్ రెడ్డి, ఎంపిడిఒ పరిపూర్ణ అరుంధతి తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిఐ దస్తగిరి, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ విన్నీలత, డిప్యూటీ ఎంపిడిఒ వీరభద్రుడు, ఆర్ఐ వెంకట లక్ష్మీ, కార్యదర్శి లక్ష్మి నరసింహులు, ఎపిఎం అపర్ణ దేవి, విఆర్ఒ రాజ శేఖర్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం : యోగాంధ్ర ర్యాలీని ఎంపిపి వీరనారాయణరెడ్డి, ఎంపిడిఒ వీర కిషోర్, ప్రారంభించారు. ఎంపిడిఒ కార్యాలయం నుండి ఐదు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పడి యోగాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఒ మల్లికార్జున, ఆయుర్వేదిక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పల్లా.మహేష్ యోగ మాస్టర్ ట్రైనర్ పత్తి సురేష్ అన్ని పంచాయతీ కార్యదర్శులు, జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

పాలిసెట్ కౌన్సెలింగ్ శనివారం నుంచి ప్రారంభం అవుతుందని మైదుకూరు పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, మెకానికల్ , ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కెమికల్ , మెటలర్జీ , కంప్యూటర్ ఇంజినీరింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ డిప్లొమా కోర్సులలో ప్రవేశాలకు విద్యార్థులకు అవకాశం ఉందన్నారు. పాలిటెక్నిక్‌లో మైదుకూరు కళాశాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల నిరంతర, ప్రత్యేక , వ్యక్తిగత పర్యవేక్షణ పాలిటెక్నిక్ విశిష్టత అన్నారు. మొదటి సంవత్సరంలోనే కంప్యూటర్ ఇంజినీరింగ్ అండ్ ఇంటర్నెట్ అఫ్ థింగ్స్ డిప్లొమాలో రాష్ట్రంలోనే ప్రథమ ర్యాంక్‌ను పి. అనంతసేన సాధించిందన్నారు. విద్యార్థులకు హాస్టల్ వసతి ఉందని, , ప్రభుత్వ నియమనిబంధనల మేరకు స్కాలర్‌షిప్, ఫీజ్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం ఉందని తెలిపారు.

వెలగని వీధి దీపాలు.. ఇబ్బందుల్లో ప్రజలు

ప్రజాశక్తి-గోపవరం

మండలంలోని చిన్న గోపవరం కాలనీలో వీధిదీపాలు వెలగడం లేదు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రజలు చీకటిలో నివసించాల్సిన దుస్థితి ఏర్పడింది. పైగా రహదారి పక్కన ఉన్న లైట్లు వెలగకపోవడం వల్ల వాహనదారులకు దారి కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. పిల్లలు, మహిళలు, వృద్ధులు రాత్రివేళ బయటకి వెళ్లేందుకు భయపడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో చోరీలు, తాగుబోతుల బెడదలు కూడా పెరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు స్పందన లేకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే వీధి దీపాలను మరమ్మతు చేసి ప్రజలకు భద్రత కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఎయిడెడ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



నరసింహభార్గవ్ (ఫైల్)

శ్రీ శాంతి నికేతన్ ఓరియంటల్ స్కూల్ ప్రధా నోపాధ్యాయులు వేదాళం నరసింహ భార్గవ్ (52) శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. మైలవరం మండలం, దొమ్మరనంద్యాల గ్రామంలో ఉన్న ఎయిడెడ్ పాఠశాలలో ప్రధానో పాధ్యాయులుగా పనిచేస్తున్నారు. శుక్రవారం ఉదయం కూడా స్కూల్ కి వెళ్లి ఆరోగ్యం బాగలేదని జమ్మలమడుగులోని ఇంటికి వచ్చి ఓ ప్రయివేట్ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు అంబులెన్స్‌లో ప్రొద్దుటూరుకు వెళుతుండగా పరిస్థితి విషమించి మృతిచెం దారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. నరసింహ భార్గవ్ సుపరిచితుడు కావడం వల్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు మృతదేహానికి నివాళులు అర్పించారు.

నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించండి

ప్రజాశక్తి - కడప

మండల స్థాయిలో ఇప్పటికే ఉన్న అధికారులు, సచివాలయ వ్యవస్థ సిబ్బంది, తగిన అకాడెమిక్ మేధావులతోనే నియోజకవర్గ అభివృద్ధి కార్యాచరణలు రూపొందించవచ్చని డిసిసి అధ్యక్షులు విజయ జ్యోతి అన్నారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. మరోసారి ప్రజాధనాన్ని వృథా చేస్తూ యువ నిపుణుల పేరుతో రూ.60 వేల జీతాలతో 175 మందిని నియమించడం పూర్తిగా అనవసరం అన్నారు. ఈ వ్యయాన్ని ప్రజలకు ప్రత్యక్ష లాభం చేకూరే అభివృద్ధి పనులకు మళ్లించాలని, ప్రజా ధనానికి విలువను కల్పిస్తూ ప్రభుత్వమే పని చేయాలి అని సూచించారు.

వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించండి



మాట్లాడుతున్న ముస్లిమ్ మైనార్టీ నాయకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు టౌన్

ప్రొద్దుటూరు వ్యాప్తంగా కోట్ల విలువైన వక్ఫ్ భూములు ఆక్రమణలు చోటు చేసుకున్నాయని ముస్లిం మైనార్టీ నాయకులు షరీఫ్, బాబాఫకృద్దీన్ ఆరోపించారు. ప్రొద్దుటూరు ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు భూములు ఆక్రమణ దారుల నుంచి పరిరక్షణ చేయాలని ఫిర్యాదులు ఇస్తే అధికారులు పట్టించుకోవడంలేదని, అక్రమణలు చేసే వారికి బాసటగా నిలుస్తూ కాపాడుతున్నారని ఆయన అన్నారు. ఆక్రమించేవారిపై ఎలాంటి పోరాటం చేయడానికైనా సిద్ధంగా ఉన్నామని, మున్ముందు పోరాటాలు ఉధృతం చేస్తామని అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకు కూడా చేస్తామని అన్నారు. మైనార్టీ ప్రజల అభివృద్ధి కోసం పూర్వం రాజులు, నవాబులు, ధనవంతులు తమకున్న సంపదలో కొంత భాగం దానం రూపంలో ఇచ్చారని చెప్పారు. ఈ భూములను ఆక్రమణలు జరగకుండా పరిరక్షణ చేయడానికి వక్ఫ్ బోర్డు ఏర్పాటైందని తెలిపారు. వక్ఫ్ భూములలో క్రయ, విక్రయాలు, ఆక్రమణలు చేయడం నేరమని ఎవరైనా ఆక్రమణకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వక్ఫ్ చట్టం, భారత సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు.హైకోర్టు తీర్పులు ఇచ్చాయని చెప్పారు. అయినప్పటికీ ఆక్రమణలు జరుగుతూ ఉన్నాయని తెలిపారు. ప్రొద్దుటూరు పట్టణంలోని మొడమీదిపల్లి సర్వే నంబరు 278/1,260, .1.02,1.23, ఎకరాలలో ఎక్కువగా వక్ఫ్ భూముల ఆక్రమణలు జరిగాయని ఆధారాలతో సహా ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని, అధికారుల పర్యవేక్షణ లోపం నిర్లక్ష్యం కారణంగా వక్ఫ్ భూములు ఆక్రమణలు జరుగుతున్నాయని తెలిపారు. ఫిర్యాదుదారునిపై అక్రమ కేసులు బనాయిస్తూ భయభ్రాంతులకు కలుగజేసేలా, హక్కులు కాలరాసేలా నివేదికలు ఇస్తున్నారని అన్నారు. నిషేధిత భూముల జాబితాలో ఉన్న భూములకు రిజిస్ట్రర్లు చేయడంతో పంచాయతీ కార్యాలయాల్లో ఇంటి నిర్మాణం కోసం అనుమతులు ఇస్తున్నారని చెప్పారు. ఆక్రమణకు గురి అయిన వక్ఫ్ ఆస్తులను పరిరక్షించి భూములలో కట్టడాలను నిర్మించిన వాటిని కూల్చి వేసి ఆక్రమణ దారులకు సహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో షరీఫ్.యస్, బాబాఫకృదీన్. కరిముల్లా, ముబారక్, మాబు హుస్సేన్ పాల్గొన్నారు.

రెవెన్యూ సేవలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

రెవెన్యూ శాఖ అందించే రెవెన్యూ సేవలపై ప్రజలు అందరూ అవగాహన కలిగి ఉండాలని తహశీల్దార్ శోభన్ బాబు తెలిపారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలలో రెవెన్యూ శాఖ ప్రముఖమైందని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు, ఎన్నికల సందర్భంలోనూ రెవెన్యూ శాఖ కీలకంగా వ్యవహరిస్తుందని వివరించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారంలో రెవెన్యూ ముందు ఉంటుందన్నారు. రెవెన్యూ రికార్డులు, వక్ఫ్, దేవాదాయ, ప్రభుత్వ భూములకు సంబంధించి రికార్డులు అందుబాటులో ఉంటాయని, వన్ బి, అడంగల్ సేవలు అందుబాటులో ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో డిటి అరవింద కిషోర్, ఆర్ఐ అర్జున్, విఆర్ఒలు, స్థానిక ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

దువ్వూరు : కేంద్రమైన స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సదస్సు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయానికి వచ్చిన రైతులతో, ప్రభుత్వ సర్టిఫికెట్ల కేఓసం వచ్చిన ప్రజలతో గౌరవంగా వ్యవహరించి వారి పనులను చేయాలని ఆయన సూచించారు కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఎర్రగుంట్ల : మాట్లాడుతున్న తహశీల్దార్ శోభన్‌బాబు

సాగునీటి రంగంపై అనాలోచిత నిర్ణయాలు : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

గోదావరిలో పుష్కలములగా నీళ్లు ఉన్నాయని తెలంగాణా ప్రభుత్వం ప్రాజెక్టులు కట్టుకోవచ్చునని, తాను ఎలాంటి అభ్యంతరం చెప్పనని కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం అనాలోచితం, అవివేకం, అవగాహనా రాహిత్య నిర్ణయాలని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిఎం చంద్రబాబు తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు వల్ల దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు పెను ప్రమాదమని చెప్పారు. 75 శాతం విశ్వసనీయత ఆధారంగా గోదావరినదిలో 3వేల టిఎంసిల నికర జలాలుంటాయని బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ఇచ్చిందని చెప్పారు. ఈ నికర జలాలను మహారాష్ట్రకు 889 టిఎంసిలు, కర్నాటకకు 20, ఛత్తీస్గఢ్‌కు 625, ఒరిస్సాకు 293, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు పునరుత్పత్తి జలాలతో కలిపి 1480 టిఎంసిలు కేటాయించిందని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 1480 టిఎంసిలలో ప్రాజెక్టుల వారీగా తెలంగాణ ప్రాజెక్టులకు 710 టిఎంసిలు, ఆంధ్ర ప్రదేశ్ ప్రాజెక్టులకు 770 టిఎంసిలు కేటాయించినట్లు చెప్పారు. తెలంగాణాలోని సింగూర్, నిజాం సాగర్, శ్రీరామ్ సాగర్, కడెం, మిడ్ మానేర్, ఎల్లంపల్లె, సుందేళ్ల, అన్నారం, తుమ్మిడి హట్టి, కాళేశ్వరం, తుపాకుల గూడెం, సీతారామ, ఇచ్చంపల్లె ప్రాజెక్టులకు 710 టిఎంసిలను కేటాయించిందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం ప్రాజెక్టుకు 385, గోదావరి డెల్టాకు 264 టిఎంసిల నికర జలాలు కేటాయించిందని చెప్పారు. బచావత్ ట్రిబ్యునల్ ఉన్న నికర జలాలను వివిధ రాష్ట్రాలకు కేటాయించిందని తెలిపారు. గోదావరిలో నికర జలాలు లేవని చెప్పారు. వరద జలాలు ఉండవచ్చు, వుండక పోవచ్చు అన్నారు. ఉన్న మిగులు జలాలు వాడుకునే స్వేచ్ఛ దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే ఉంటుందని చెప్పారు. ఎగువ రాష్ట్రమైన తెలంగాణ కేటాయించిన 710 టిఎంసిలకు మించి నీటిని వాడుకుంటే పోలవరం ప్రాజెక్టుకు, గోదావరి డెల్టాకు నీళ్లు రాని ప్రమాదం ఉంటుందని చెప్పారు. అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేసుకొన్న తర్వాత పోలవరం - బనక చర్ల గురించి ఆలోచించాలని అన్నారు.

కడప ఉక్కుపై మాట తప్పిన చంద్రబాబు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు : కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్ నిర్మాణంపై ముఖ్యమంత్రి చంద్రబాబు మళ్లీ మాట తప్పారని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ తులసి రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విభజన చట్టంలో 13వ షెడ్యూల్ ప్రకారం కేంద్ర ప్రభుత్వం స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కడప జిల్లాలో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ నిర్మించాలని, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఉంటే ఇప్పటికే నిర్మించి ఉండేదని పేర్కొన్నారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి, వైసిపి అధికారంలోకి రావడంతో ఇప్పటివరకు నిర్మాణాలకు నోచుకోలేదు అన్నారు. 2018లో చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో మైలవరం మండలంలో ఏం కంబాలదిన్నె గ్రామం వద్ద 3892 ఎకరాల్లో రాయలసీమ స్టీల్ ప్లాంట్ పేరుతో టెంకాయ కొట్టి శంకుస్థాపన చేశారు అన్నారు. కానీ ఒక్క రూపాయి పని కూడా అక్కడ జరగలేదు అని అన్నారు. తరువాత వై.ఎస్. జగన్ 2019 డిసెంబర్ 23న జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లి వద్ద 3200 ఎకరాల్లో ఎపి హైగ్రేడ్ స్టీల్ కార్పొరేషన్ పేరుతో టెంకాయ కొట్టి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. 2023 ఫిబ్రవరి 15న మళ్లీ అదే చోట ముఖ్యమంత్రి జగన్ జిందాల్ స్టీల్ వర్క్స్ పేరుతో మళ్లీ శంకుస్థాపన చేశారన్నారు పనులు మాత్రం జరగలేదన్నారు. ప్రస్తుతం కూటమిటి ప్రభుత్వం అధికారంలోకి వచ్చారని, చంద్రబాబునాయుడు కడపలో నిర్వహించిన మహానాడులో ఉక్కు నిర్మాణంపై చేశారని అన్నారు. 2025 జూన్ 12 లోపల జిందాల్ కంపెనీ పనులు ప్రారంభిస్తుందని 3,500 మందికి ఉపాధి కల్పిస్తుందని మొదటి ఫేస్ లో రూ .4500 కోట్లు రెండవ ఫేస్ లో రూ .4500 కోట్లు పెట్టుబడి పెడుతుందని ఆయన చెప్పారని తులసి రెడ్డి గుర్తు చేశారు. సమావేశంలో అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి పూల నజీర్ కాంగ్రెస్ నాయకులు షంషీర్, అలీ, మహబూబ్‌బాషా, అమర్‌నాథరెడ్డి, ఉచ్చన్న, వినయ్ పాల్గొన్నారు.

ఆరోపణలకు వివరణ ఇవ్వాల్సిందే

- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

గతంలో తనపై చేసిన ఆరోపణలకు ప్రజలకు వివరణ ఇచ్చానని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పై వచ్చిన ఆరోపణలపై ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ఆయనపై ఉందని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి అన్నారు. వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే శుక్రవారం స్థానిక దొరసానిపల్లెలోని ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తనపై ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి చేసిన ఆరోపణలకు తాను గురువారం మీడియా ద్వారా ప్రజలకు సమాధానం ఇచ్చిన తరహాలో ఆయన కూడా తన ఆరోపణలకు వివరణ ఇవ్వాలన్నారు. నిమ్మకాయల సుధాకర్ రెడ్డి చెరువు భూమి అని 6 నెలల పాటు ఆపిన ఎమ్మెల్యే, హైకోర్టు రికార్డులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని తెలపగానే రెవెన్యూ అధికారులు ఎన్ఒసి ఇచ్చారని చెప్పారు. ఈ వ్యవహారంలో వరదరాజులరెడ్డి, ఆయన కుమారుడు కొండారెడ్డి కారణంగానే ఆయనకు అక్కడ 2 ఎకరాల భూమి లభించిందని ఆరోపించారు. విజయవాడలో బ్రాహ్మణ ఆడిటర్‌కు చెందిన వివాదాస్పద భూమిని అక్రమంగా కొనుగోలు చేసి ఆడిటర్ వారి మాట వినటం లేదని అతన్ని హతమార్చారని ఆరోపించారు. పైగా ఆ కేసులో ఎమ్మెల్యే కుమారుడు, బచ్చల పుల్లయ్య కుమారుని తప్పించడంతో పాటు, వరదరాజులరెడ్డి కి వాటా అందలేదని అతని బంధువుల ఇంటి వద్ద ధర్నా చేసిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఆర్థిక లావాదేవీల కారణంగా శివగణేష్ అనే ఆర్యవైశ్యుని పై కొండారెడ్డి హైదరాబాద్‌లో దాడి చేస్తే, ఎఫ్ఐఆర్ నమోదు అయ్యింది వాస్తవం కాదా అన్నారు. ప్రొద్దుటూరు లో ఆర్థిక లావాదేవీల కారణంగా ఇ.వి.సుధాకర్ రెడ్డి పై దాడి చేశారని గుర్తు చేశారు. వరదరాజులరెడ్డి మనుమడు అమల్ రెడ్డి అపర్ణ కన్ స్ట్రక్షన్ లో అతనికి సంబంధం లేకుండా ఫ్లాట్లు విక్రయించారని ఆరోపించారు. ఎస్ఎస్ మాల్ విషయంలో మున్సిపాలిటీకి రూ. 5.70 కోట్లు చెల్లించాలని, ఆ మొత్తం చెల్లించకుండా అక్కడ రూముల నిర్వాహకులను ఇబ్బందులకు గురి చేస్తారా అని ప్రశ్నించారు. తాను అప్పులు తీసికొని ఇబ్బంది పెడుతున్నానని ఎమ్మెల్యే ఆరోపించారని ఆయన దృష్టికి వచ్చిన వారితో ఎంత మొత్తం తాను చెల్లించాలో తెలపాలని కోరారు. వీటన్నిటింకి ఎమ్మెల్యే సమాధానం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గుర్రం లావణ్య, రాగుల శాంతి, గరిశపాటి లక్ష్మిదేవి, సుబ్బారెడ్డి, గోపవరం ఉప సర్పంచి బీరం రాఘవేంద్ర రెడ్డి, మండల వైసీపీ అధ్యక్షుడు మార్తల ఓబుళరెడ్డి, నాయకులు గంజికుంట ఆంజనేయులు, కాశయ్య పాల్గొన్నారు.

బ్రహ్మంగారి హుండీ ఆదాయం రూ.31.45 లక్షలు

ప్రజాశక్తి - బ్రహ్మంగారి మఠం

బ్రహ్మంగారిమఠం జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరు వీం బ్రహ్మేంద్రస్వామికి భక్తులు కానుకల ద్వారా సమర్పించిన హుండీ ఆదాయం రూ. 31,45,884 నగదు, 13 గ్రాములు బంగారం, 280 గ్రాములు వెండి వచ్చినట్లు ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ తెలిపారు. పోలేరమ్మ హుండీ కలిపి 8 హుండీలు, 40 రోజులకు సంబంధించి లెక్కించినట్లుగా వారు తెలిపారు. వచ్చినటువంటి ఆదాయాన్ని మఠం అభివృద్ధి కోసం ఉపయోగిస్తామన్నారు. కార్యక్రమంలో మేనేజర్ ఈశ్వరయ్య చారి, కీర్తిశేషులు వెంకటేశ్వర స్వామి మఠాధిపతులు కుమారులు, భక్తులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక వాసవి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి రోగుల నుంచి విశేష స్పందన వచ్చిందని ఆవోపా అధ్యక్షుడు బైరిశెట్టి వెంకట సునీల్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక వాసవి కల్యాణ మండపంలో ఆవోపా, ఆవోపా మహిళా విభాగం, కడపకు చెందిన సుధా టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత సంతాన సాఫల్య శిబిరం నిర్వహించారు. దీంతో సంతానం లేని మహిళాలు శిబిరానికి రావడంతో సంతాన సాఫల్య వైద్యులు సామా సుధ పరీక్షలు చేశారు. స్త్రీలకు సంబంధించి గైనిక్ సమస్యలకు ఉచితంగా వైద్యం అందించారని ఆవోపా అధ్యక్షులు బైరిశెట్టి వెంకట సునీల్ కుమార్ తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో 53 మందికి గైనిక్ పరీక్షలు చేసినట్లు చెప్పారు. మందులను కూడా మహిళాలకు ఉచితంగా పంపిణీ చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా వైద్యం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అవోపా కార్యవర్గం, అవోపా మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న సాఫల్య నిపుణురాలు డాక్టర్ సామాసుధ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న మాధవిలతారెడ్డి

ప్రతి ఒక్కరిలోనూ సేవాగుణం ఉండాలి

- టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

సమాజ సేవ చేసేందుకు, అపదలో ఉన్న వారిని ఆదుకొనేందుకు సేవా గుణం అనేది ప్రతి ఒక్కరిలో రావాలని అప్పుడే సమాజం బాగుపడుతుందని టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి, బిటెక్ రవి సతీమణి మాధవి లతారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎస్ఎస్ఆర్ కల్యాణ మండపంలో సింగారెడ్డి సుబ్బమ్మ మొదటి వర్ధంతి సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడు నరసింహారెడ్డి తన తల్లి పేరు మీద పేదలకు, విభిన్న ప్రతిభావంతులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు విచ్చేసి మాట్లాడారు. ఉపాధ్యాయుడు నరసింహారెడ్డి ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు, యూనిఫాం, పలకలు ఇచ్చేవారని చెప్పారు. సేవా కార్యక్రమాలు చేయాలనే తపన ఆయనలో ఉండడం సంతోషకరమని చెప్పారు. తల్లిపై ఉన్న అభిమానంతోనే నరసింహారెడ్డి కుటుంబ సభ్యులు అందరూ కలిసి 500 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేయడం సంతోషకరమని చెప్పారు. విద్య రంగంలో కూడా విశేష సేవలు అందించారని ఎంఇఒ స్టాలిన్ ఐజాక్ తెలిపారు. తల్లిదండ్రులు పేరుతో అనాథ వృద్ధులకు ఆదుకొనేందుకు ఇలాంటి కార్యక్రమాలు పెట్టడం శుభ పరిణామం అన్నారు. దాత నరసింహారెడ్డి మాట్లాడుతూ తనకు చిన్నప్పటి నుంచే సేవా గుణం ఉందన్నారు. తనలాగే సేవా గుణం ఉండే విధంగా తన పిల్లలకు కూడ అలవాటు చేసినట్లు తెలిపారు. అనంతరం పేద ప్రజలకు దుప్పట్లును అతిథుల్ల చేతుల మీదుగా పంపిణీ చేశారు. అలాగే అన్నదానం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, ఎంఇఒ వెంకటరామిరెడ్డి, టిడిపి నేతలు తెలంగాణ వలి, సింగారెడ్డి రఘునాథ్ రెడ్డి, మహమ్మద్ ఇనాయతుల్లా, వేమకుమార్, తక్కల షరీఫ్, శివ, జబిబుల్లా, డక్కా రమేష్, బాలకృష్ణారెడ్డి, పీరా సాహెబ్, వీరబద్ర, ఉపాధ్యాయులు సుకన్య, సంఘమేశ్వర రెడ్డి, ధర్మారెడ్డి, నాయుడు తో పాటు నరసింహారెడ్డి కుటుంబ సభ్యులు, పేద ప్రజలు పాల్గొన్నారు.

బలిజలను బిసిలలో చేర్చాలి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు) : బలిజ, తెలగ, కాపు, ఒంటరిలను బిసిలుగా మార్చాలని బిసి రిజర్వేషన్ సాధన సమితి కన్వీనర్ సానా ప్రసాద్ డిమాండ్ చేశారు. బిసి రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో చిత్తూరు నుంచి అమరావతి వరకు చేపట్టిన పాదయాత్ర శుక్రవారం మైదుకూరుకు చేరుకునంది. ఈ సందర్భంగా పాదయాత్రలో పాల్గొన్న ప్రసాద్, సభ్యులను మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర బలిజ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ అన్ని రకాలుగా వెనుకబడిన బలిజ, తెలగ, కాపు, ఒంటరి లను బీసీలుగా చేర్చేందుకు ఉపముఖ్యమంత్రి, ముఖ్యమంత్రి కృషి చేయాలన్నారు. గత ఎన్నో సంవత్సరాలుగా పోరాటం సాగిస్తున్న ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి బిసిలుగా మార్చాలన్నారు. కార్యక్రమంలో బలిజ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

- శాస్త్రవేత్త డాక్టర్ వి.శిల్పకళ

ప్రజాశక్తి - చక్రాయపేట

ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని డాక్టర్ వి.శిల్పకళ తెలిపారు. శుక్రవారం మండలంలోని నేర్సుపల్లి గ్రామంలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి, అదనపు ఆదాయం పొందవచ్చునని చెప్పారు. ఆర్థిక, ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చునని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతుందని తెలిపారు. నాణ్యత పరమైన ఉత్పత్తులను పెంపొందించడం కోసం రైతులు ఎంతో కృషి చేయాలన్నారు. ట్రైకోడెర్మా సూడోమోనాస్ వినియోగం, ప్రధాన పంటలలో కాషాయల ద్వారా పురుగు, తెగుళ్ల యాజమాన్యం, జిగురు అట్టలు, లింగాకర్షక బుట్టలు, దీపపు ఎరలు, పక్షి స్థావరాలు, కంచె పంటలు, ఎర పంటలు, జీవనీయంత్రణ పద్ధతుల ద్వారా సస్యరక్షణ, గురించి వివరించారు. డాక్టర్ కె.సాయి మహేశ్వరి శాస్త్రవేత్త (సేద్య విభాగం), ప్రకృతి వ్యవసాయంలో పంటలు, రకాల ఎంపిక, బీజామృతం ద్వారా విత్తనం, నారు శుద్ధి చేయడం, జీవన ఎరువుల వినియోగం, ద్రవరూప సేంద్రియ ఎరువుల తయారీ గురించి వాటిలోని పోషకాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఎం. ప్రతాప్. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్, ఏపీ సీఎం ఎఫ్ సిబ్బంది , రైతులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

ప్రజాసేవ మరిచిన కడప మేయర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కడప

కడప మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ సురేష్ బాబు, కడప ఎమ్మెల్యే మాధవి ప్రజాసేవ మరచి పోవడం అత్యంత బాధాకరమని ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ అలీఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నాటి కడప మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి సంబంధించిన పరిణామాలు ప్రజాస్వామ్యానికి రాజ్యాంగానికి స్థానిక సంస్థల ఆత్మగౌరవానికి గొడ్డలి పెట్టుగా మారాయి అన్నారు. కేవలం కడప మున్సిపల్ కార్పొరేషన్ పై సుమారు ఏడాది కాలం పాటు మేయర్ సురేష్ బాబు, కడప ఎమ్మెల్యే మాధవి మధ్య జరుగుతున్న అధిపత్య పోరు సమంజసం కాదన్నారు. కేవలం వ్యక్తిగత ప్రతిష్ఠ, రాజకీయ ఆదిపత్యం లక్ష్యంగా కడప మున్సిపల్ కార్పొరేషన్ పై పట్టుకు ఇద్దరి మధ్య రగడ తారాస్థాయికి వెళ్లడం ఎంతవరకు సబబని అని ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధులుగా ప్రజలు అప్పగించిన బాధ్యతలు ఇరువురు మరిచి పోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేయాల్సిన ప్రజా ప్రతినిధులు ఎప్పుడు కుర్చీ కోసం తగవులాడటాన్ని కాంగ్రెస్ పార్టీగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇప్పటికైనా నగరంలోని సమస్యల పరిష్కారం దృష్టి సారించాలన్నారు.